# కాలచక్రం X

రచన:
శ్రీమతి పఠానేని శ్రీశైల భ్రమరాంబ.

ఏమిటో తన జీవితమంతా నిస్సారం అయిపోతోన్నట్లుంది. ఎదుగూ బొదుగూ లేని ఏకాకిగా జీవితాన్ని సాగించాలని లేదు. ఆశలూ, ఆశయాలు అణగారిపోతున్నాయి. కాలేజీలో చదువు మినహాగా తనలో అనుభవం, ఆనందం మళ్ళీ లేదు. సాగిలపడ్డా సాయంత్రంలా కోర్కెలు వెచ్చదనాన్ని కూడా కోల్పోతున్నాయి. జీవితంలో ఇరవై, మూడు వసంతాలు చూచిన తనకు బ్రతుకు నవోదయం నవోషస్సు లేక బీటలు వారినట్లుగా వుంది.

ఇల్లాంటి తన జీవితాన్ని కొంచెం మార్పు చేసుకోవాలనుకుంది మీనాక్షి. తనకి ఉద్యోగం చెయ్యాలని ఉన్నా, తల్లి తండ్రి ఒప్పుకోరు. బి. ఎ. డిగ్రీ పొంది ఎందుకూ కొరకాకుండా ఇంట్లో కూర్చోవడం తన కెంతో కష్టంగా వుంది. పోనీ తనభర్త రఘునాథ్ దగ్గరకే పోదామంటే? ఆతనికి ఇంకా రెండేళ్ళ చదువుతో కాని యం. బి. బి యస్. పూర్తి కాదు. అంతవరకూ తనిల్లో నిర్వ్యాపారంగా, కూర్చోలేక పోతోంది. ఇంట్లో అమ్మ, బామ్మ, ఇరుగుపొరుగు అమ్మలక్కలు. పిచ్చి పాటీతో తనకి విసుగెత్తిపోతోంది. జీవితంలో కొత్తదనం కావాలి. లేకపోతే ఇంక తనకి మనస్సు మొద్దుబారిపోయి బుద్ధి మాంద్యం కూడా వస్తుందేమో నన్న సందేహం కల్గుతోంది.

తనభర్త రఘునాథ్ దగ్గరనుంచి తను ఉద్యోగం చెయ్యడానికి పర్మిషన్ తెచ్చుకుంది. ఆతనిచదువు పూర్తయివచ్చేవరకూ మాత్రమే చెయ్యమని హుకుంజారీ చేస్తూ జాబు వ్రాశాడు. తల్లిదండ్రుల ఒప్పుదల పొందింది. నెలరోజులు విశ్వప్రయత్నాలు చేసి ఒక ఆఫీసులో గుమాస్తా ఉద్యోగం సంపాదించింది మీనాక్షి.

మొట్టమొదటిరోజున జాయినింగు రిపోర్టు యిచ్చి తనకు ప్రత్యేకంగా కేటాయించబడిన కుర్చీలో కూర్చుంది టేబిల్ నిండా కాగితాలు. ఫైల్సు అన్నీ చిందరవందరగా పడివున్నాయి. ఒక్కసారిగా ఆ సెక్షనంతా కలయచూచింది. ఎవరి పనుల్లో వారు సమగ్రంగా నిమగ్నులై పోయారు.

'వీరంతా కలాలు పరుగెత్తిస్తూ, బుర్ర బద్దలు కొట్టుకుని రెక్కలుముక్కలయ్యేలా, దృష్టి ఎటూ పోనివ్వకుండా ఎందుకు, ఉద్యోగం చేస్తున్నారో?' అనుకొంది మనస్సులో మీనాక్షి. మళ్ళీ అంతలోనే బ్రతకడం కోసం, భార్యాబిడ్డల పోషణకోసం ఆఫీసులో ఒంచిన తలఎత్తకుండా వీరంతా చాకిరీ చేస్తున్నారు. అని తనలో తనే సమాధానం చెప్పుకుంది.

అక్కడ వుండే గుమాస్తాలెవ్వరిముఖంలోనూ జీవకళ కన్పించడంలేదు. వారుచేసే ప్రతీపని మాంత్రికంగా చేస్తోన్నట్లు స్పష్టంగా కన్పిస్తోంది.

తనతోటి గుమాస్తాలందరికీ పరిచయం చేశాడు ఆఫీసరు. సాయంకాలం ఆఫీసువదలి బయటకు వస్తోంటే బక్కచిక్కిపోయి తలనెరిసిన హెడ్‌గుమాస్తా తన దగ్గరగా వచ్చి, ఇదుగో మీనాక్షిగారూ: ఈ ఆఫీసరు నరరూపరాక్షసుడు ఆఫీసులో ఎంతపనిచేసినా కించిత్ కూడా మెప్పు అంటూవుండదు. చేసినకొద్ది ఇంటిచాకిరీ కూడా చేయించుకుంటాడు. ఇంట్లో అరడజనుమంది పిల్లలు భార్యా వున్నారు. కాస్త విశ్రాంతిగా వున్నట్లు మనం కన్పించామా యింటికి వెళ్ళి చాకిరీ చేయమంటాడుఈయన. జాగ్రత్తగా వుంటోండు ఆఫీసులో అని పుత్రికాభావంతో హెచ్చరించాడు.

ఇంటికి వచ్చింది మీనాక్షి. తన తండ్రి వచ్చి మధ్యాహ్నం వెళ్ళి ఆఫీసులో జాయిన్ అయ్యావా?' అని అడిగాడు తండ్రి.

''నాన్నా! వాళ్ళంతా బ్రతకడంకోసం ఉద్యోగం చేస్తూంటే; నేను కాలక్షేపం చేస్తున్నానంటే నమ్ముతారా?' అంటూ అడిగింది.

'వాళ్ళంతా నమ్మినా నమ్మకపోయినా నీకేంవారితో. ఎక్కువ సంబంధం అవసరం లేదు, నువ్వు ఆ మగవాళ్ళందరి మధ్యా చాలా జాగ్రత్తగా మసలుకోవాలి, అడుగు తీసి అడుగువేస్తే స్త్రీ జీవితం కత్తిమీద సాముచేసినట్లే వుంటుందని గుర్తుంచుకో, చుట్టూ వున్నారు మనుష్యులు పదునైన కత్తుల్లాంటివాళ్లు. ఎవరు ఏతత్వంతో వుంటారో చెప్పడానికి వీలులేదు. వంటరిగా వున్న స్త్రీని చూస్తే అందరికీ అనేకరకాల భావాలు కల్గుతుంటాయి. అన్ని పుట్టల్లోని పాములూ కాటువెయ్యడానికి ప్రయత్నించేవే కాని పడగనిప్పి నాట్యం చేసేవి కావని గుర్తుంచుకో.'

తండ్రి మాటలు విన్నాక తల్లిదగ్గరకు వెళ్ళింది మీనాక్షి. ఆఫీసులో తను చూచినవన్నీ చెప్పింది.

'ఆఫీసరు ఎదురుగా అత్తకుజడిసే కోడళ్ళలాగ గుమాస్తాలు పనిచేసినా; యజమాని మరుగయ్యాక నీతో కబుర్లకిప్రారంభిస్తారు-నువ్వు చాలా జాగ్రత్తగా ముళ్లకంప మీద నడుస్తూన్నట్లుగా నడుచుకోవాలి' అంది తల్లి.

'మనమేమీ తప్పుచేయకుండా వుంటే వాళ్ళతో సరదాగా మాట్లాడితే మాత్రం తప్పేముంది?' 'మన పల్లెటూళ్ళో వాళ్ళకు స్త్రీ పురుషుల్లో ఒక్క శారీరక సంబంధం మాత్రమే వుంటుందని అపోహపడ్తారు.' మనలో కల్మషం లేనప్పుడు వాళ్ళు అల్లా అనుకున్నంత మాత్రంలో మనకేం నష్టం రాలేదులే' అని నిర్లక్ష్యంగా జవాబిచ్చింది మీనాక్షి.

'నీకు లోకం సంగతి తెలీదమ్మా! ఇక్కడివాళ్ళకు కూడా మంచిదృష్టి లభించేవరకూ మనం కూడా అందుకు అనుగుణంగా ప్రవర్తించకపోతే మంచివాళ్ళు కూడా చెడ్డవాళ్ళుగానే చూడబడుతారు.

'జీవితం ముందుకు సాగాలంటే ఇల్లాంటి అల్పులందరికీ భయపడ్తే ఎల్లాగమ్మా?'

'భయపడకపోతే వీల్లేదమ్మా! అల్పసంసారాలు, ఆత్మౌన్నత్యం లేనివాళ్ళు చాలా అసహ్యంగా అర్థం చేసుకుంటారు, ఒక్క స్త్రీలేకాదు అల్లా అనుకునేది. పురుషుల్లోకూడా ఒక అబల వంటరిగా కన్పిస్తే తమలోని సర్వహోదాలకీ తిలోదకాలిచ్చి స్త్రీల వెంటబడేవాళ్ళు.కూడావుంటారు. అల్లా కాలచక్రం క్రిందబడి బలమైన పురుషులఇనపపాదాల క్రింద నలిగి నశించిన అబలలుకూడా ఈ లోకంలో ఎందరో వున్నారు. జాగ్రత్తగా ప్రవర్తించుకో. ఆడవాళు ఒట్టి దుష్ప్రచారం మాత్రం చేసి వదలివేస్తారు, గాని మగవాళ్ళు జీవితాన్ని సమూలనాశనం చేస్తే కాని వదలరు. ఈనగ్న సత్యాన్ని మర్చిపోకు' అంటూ హెచ్చరించింది తల్లి-

నెలజీతం చల్లగా అందుకుంది మీనాక్షి.

ఒకరోజున ఆఫీసరు తనదగ్గరకు వచ్చి 'మీనాక్షి గారూ మీ కెప్పుడైనా అవకాశం వుంటే కొంచెంసేపు స్నేహధర్మంగా నాతో మాట్లాడ్తారని ఆశిస్తున్నా,' అన్నాడు.

ఈ నెలరోజులనుంచీ తను ఆఫీసులో పనిచేస్తున్నా, ఆఫీసరుని ఒక పెద్దపులిలా చూస్తోంది. అటువంటిదీనాడు ఇల్లా అనడంలో కొంచెం ఆశ్చర్యపడింది.

అప్పుడప్పుడు అవకాశం చిక్కినప్పుడల్లా ఆఫీసరు తనని పల్కరిస్తోనే వస్తున్నాడు.

'మా యిల్లు బ్రహ్మాండమైన మేడ. పదిహేనుఏళ్ళ సర్వీసులో ముప్పయివేలుపోసి ఆ మేడకట్టా అంతా నా స్వార్జితమే.'

'.....................'

REGISTERED-TRADE-MARK
No:115228
మీ ఆభరణములకు
అతి శ్రేష్ఠమయినది
సవరన్ మార్కు
పారిస్ వజ్రములు
వివరములకు
PARIS DIAMOND WORKS
207.D.BIG BAZAR
TIRUCHIRAPALLI—8
పారిస్ డైమండ్ వర్క్సు
207.డి.బిగ్ బజారు
తిరుచురాపల్లి—8

'మా భవనానికి చుట్టూ చక్కని గార్డెను వేయించాను,'

'......................'

'నాకు స్వంతకారు వుంది. ఏడాదిక్రితమే నాకు ప్రమోషన్ వచ్చి జీతం హెచ్చింది'

'......................'

'నాకు సినీమాలంటే ఎంతో ఇష్టం. అభ్యంతరం లేకపోతే మీరుకూడా నా కారులో రావచ్చు.'

'......................'

'అయ్యో; మీరు వ్రాసుకుంటూంటే వచ్చి మీ పనికి ఆటంకం కల్గించాను క్షమించమని కోరుకొంటున్నా,'

'మీకు తెలీని అందం మీదగ్గర ఎంతోవుంది. మీరు నవ్వుతుంటే ఎంత అందంగా వుంటారో చెబితే మీ కర్థం కాదు-

'లోకంలోని అందమంతా ఆ విధాత మీలోనే సృష్టించాడు. అసలైన సౌందర్యం మీలోనే మూర్తీభవించింది.'

ఇల్లాంటి మాటలతో ఆఫీసరు అస్తమానూ తనను పొగుడ్తూంటే ఒళ్లు మండిపోయేది మీనాక్షికి. ఆఖరికి ఓ రోజున ఇంక తనలో సహనం తగ్గి 'ఇల్లా అసభ్యతమైన ప్రవర్తన, అసహజమైన మాటలు మాట్లాడే వాళ్లని చూస్తే నాకు పరమఅసహ్యం' అంది.

'మీరు కోపంగా వున్నా చాలా అందంగానే ఉంటారు, అసలా అందం అనేది మీ శరీరాకృతిలోనే వుందనుకొంటా-'

'మీవంటి సంకుచిత స్వభావం గలవారి దృష్టిలోనే ఆ జబ్బు వుంటుందనుకుంటా' అంది కసిమని.

'కొంచెం కాఫీ త్రాగుతారా?' అన్నాడు తెల్లబోయినట్లు పైకి కన్పించకుండా ఆఫీసరు.'

'త్రాగి వచ్చాను' అంటూ ఆఫీసులోంచి విసురుగా బయటకు నడిచివచ్చేసింది మీనాక్షి. తను ఉద్యోగంలో ప్రవేశించాక ఇంకా ఒక కేలండరుకూడా మారలేదు. ఈ ఏడాదిలోనే తను ఆఫీసరుకి ఎంత దూరంగా వుండాలని ప్రయత్నించినా కాని ఆఫీసరు, తోటిగుమాస్తాలు కూడా ఈగల్లా తనచుట్టూ ముసుర్తున్నారు. ఒంటరిపాటుగా చూస్తే చాలుఆఫీసరు జలగలా తనతో బాతాఖానీ కోసం వచ్చి కుర్చీలో కూర్చుంటాడు. తనని తెగ పొగుడ్తాడు. తన అందాన్నిగురించి వర్ణిస్తాడు అసహ్యంగా, కన్పించిన రోజున కూడా అతడు మాత్రం భట్రాజులా పొగడ్తమానడు. అతనివర్ణనల వెనుక దాగిన స్వార్థం, అతని పొగడ్తలకి వెనుక ఏదో సంకుచితత్వం ఎవ్వరికీ అర్థం కాదనుకొంటున్నాడు. తనలోని మానవత్వపు విలువల్ని కూడా పోగొట్టుకుని ఎందుకంత అధోగతికి దిగజారినట్లు ప్రవర్తిస్తాడో, అనుకొంటూ తనలో తనే దిగులుపడ్తో ఆఫీసు మెట్లమీద మిగతా గుమాస్తాల రాకకోసం ఎదురుచూస్తూ నిల్చుంది మీనాక్షి.

ఆఫీసరు అక్కడికే వచ్చి 'మీనాక్షిగారూ! యివ్వాళ మా అమ్మాయి పుట్టినరోజు. నా భార్యాపిల్లల్ని చూద్దురుగాని మా యింటికోసారి రండి' అన్నాడు.

యీ ఆఫీసరు ప్రవర్తనను గురించి స్వయంగా ఆయన భార్యతో చెప్పాలనే ఉద్దేశంతో 'సరే' అంది మీనాక్షి. మీనాక్షి ఆఫీసరు కారులో వెడుతుంటే మిగతాగుమాస్తాలంతా తెల్లముఖాలతో చూస్తూ నిల్చుండిపోయారు. కారులోనుంచి ఆఫీసరు మీనాక్షి దిగి ఇంట్లోకి వెడుతూంటే చుట్టుప్రక్కలవారంతా విచిత్రంగా చూడ్డం ప్రారంభించారు.

నరసంచారం లేని ఆ యిల్లు చూచేసరికి మీనాక్షి ప్రాణం గతుక్కుమంది. నా భార్యా పిల్లలు సంక్రాంతి పండక్కి పుట్టింటికి వెళ్లారు. ఇక్కడ మనిద్దరం తప్ప మూడోవ్యక్తి ఎవ్వరూ లేరు అన్న ఆఫీసరు మాటలకి నిర్విణ్ణురాలై పోయింది.

తన శక్తినంతా కూడ దీసుకుని నాల్గు అంగల్లో వీధులోకి పరుగెత్తుకొచ్చింది మీనాక్షి. వెనక్కి తిరిగి చూడకుండా పరుగులాంటినడకతో తన యింటివైపుకి దారి తీసింది.

కాలచక్రానికి తలవంచి భవిష్యత్ కోసం ఏదురుచూడాలే కాని, అర్థంలేని ఆవేశాలకు లోనై జీవితానికి ఒడిదుడుకులు తెచ్చుకోకూడదని గుర్తించిన మీనాక్షి మర్నాడే తన ఉద్యోగానికి రాజీనామా యిచ్చింది.

